సాక్షి
సూర్యాపేట
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023





**ఐటీ జాబ్‌మేళాకు స్పందన**
నల్లగొండలోని ఐటీ హబ్‌లో ఉద్యోగాలకు శుక్రవారం స్థానికంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. - 8లో



**ఆరుగురికి జీవితఖైదు**
2014లో జరిగిన నర్సింహులగూడెం గ్రామ నర్సంచ్ పులీందర్‌రెడ్డి హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు పడింది. - 8లో



**ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి**
మిర్యాలగూడ ఫారెస్ట్ రేంజ్‌లో బీట్ ఆఫీసర్‌పై శుక్రవారం కొందరు వ్యక్తులు దాడికి పాల్పడి గాయపర్చారు. - 8లో

• శాకాంబరిగా..



నేరేడుచర్ల పట్టణంలోని విజయదుర్గ ఆలయంలో శుక్రవారం శాకాంబరిదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

## న్యూస్‌రీల్

### శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**మఠంపల్లి:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ,చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్,అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బ్రహ్మాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, దేవీసత్యప్రసాద్, అప్పలాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.


### సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మద్దతు తెలుపుతున్న ధర్మార్జున్

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట 17 రోజులుగా సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను మరిచి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య యాదవ్, పార్టీ జిల్లా నాయకులు కంబాలపల్లి శీను, బొడ్డు శంకర్, బొమ్మగాని వినయ్ గౌడ్, యాకోబ్‌రెడ్డి, దేవత్ సతీష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### మలేరియా నివారణకు కృషిచేయాలి



పరిసరాలను పరిశీలిస్తున్న సాహితి, సిబ్బంది

**నూతనకల్:** మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా మలేరియా అధికారి సాహితి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలో వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో మూడు డెంగీ కేసులు నమోదయ్యాయని, కేసుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణమని తెలిపారు. దోమలను నియంత్రించడం ద్వారాలనే మలేరియాను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దోమల తెరలను ఉపయోగించి దోమలు కుట్టకుండా రక్షణ పొందాలన్నారు. ప్రతి శుక్రవారం ఇంటిలో డ్రై డేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవ్య, మండల వైద్యాధికారి అస్రితారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# దూకుడు పెంచేనా..!

**బీజేపీలో ఆశావహులు ఎక్కువే.. గట్టిపోటీ ఇవ్వగలిగేది ఎందరో..**

- అభ్యర్థి ఎవరైనా అందరూ సహకరించాలని తరుణ్‌చుగ్ ఆదేశం
- ఎన్నికల్లో గెలుపునకు పక్కా ప్రణాళిక ఉండాలని సూచన
- ముగిసిన నియోజకవర్గాల సమీక్ష



**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** ఉమ్మడి జిల్లాలో బీజేపీ దూకుడును పెంచుతుందా? అంటే.. అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలోని పార్టీ శ్రేణులను కలుపుకుపోయే విధంగా పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ ముఖ్య నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ దిశగా కార్యాచరణకు స్థానిక నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, భువనగిరి, సూర్యాపేట వంటి నియోజకవర్గాల్లో పార్టీ దూకుడును పెంచడంతోపాటు మిగతా నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లే ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ బూత్ స్థాయిలో పార్టీని విస్తరించే ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయిలో కంటే నియోజకవర్గాలే కేంద్రంగా ఆశావహులు కార్యాచరణలోకి దిగేలా తరుణ్‌చుగ్ దిశానిర్దేశంతో చేయడంతో వారు తమ ప్రణాళికల రూపకల్పనలో పడ్డారు.

**అసంతృప్తికి అడ్డుకట్ట వేసే లక్ష్యంతోనే..**
పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాలతోపాటు మిగతా నియోజకవర్గాల్లోనూ టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని జాతీయ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో జిల్లాలోనూ కార్యాచరణను వేగవంతం చేస్తోంది. ఆరు నెలల కిందట జిల్లాలోనూ పార్టీ గ్రాఫ్ బాగా పెరిగింది. దీంతో నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న వారి సంఖ్య పెరిగింది. పార్టీ వర్గాల్లో ఉత్తేజం నింపడంతోపాటు అసంతృప్తులకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతోనే పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నియోజకవర్గాల కోర్ కమిటీల సమావేశాలకు హాజరై సమీక్ష నిర్వహించారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా కలిసి పనిచేసేలా దిశానిర్దేశం చేశారు. అసంతృప్తులు బయటకు రాకుండా ముందస్తు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

**నియోజకవర్గాల వారీగా ఆశావహులు**

- **నల్లగొండ:** మాదగోని శ్రీనివాస్‌గౌడ్, శ్రీదేవిరెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి
- **నకిరేకల్:** చేపూరి రవీందర్, గోలి ప్రభాకర్, నకిరేకంటి మొగిలయ్య
- **మునుగోడు:** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- **దేవరకొండ:** జరుపుల కళ్యాణ్‌నాయక్, కేతావత్ లాలునాయక్
- **నాగార్జునసాగర్:** కంకణాల నివేదితరెడ్డి, శ్రీనివాస్ కొంపల్లి, రిక్కల ఇంద్రసేనారెడ్డి, పానుగోతు రవికుమార్, చెన్ను వెంకటనారాయణరెడ్డి
- **మిర్యాలగూడ:** సాధినేని శ్రీనివాస్‌రావు, రేపాల పురుషోత్తంరెడ్డి, పల్నాటి వెంకట్‌రెడ్డి
- **సూర్యాపేట:** సంకినేని వెంకటేశ్వరరావు (ఇక్కడ వట్టె జానయ్య యాదవ్ ఈటల రాజేందర్‌తో టచ్‌లో ఉన్నట్లు సమాచారం)
- **తుంగతుర్తి:** కడియం రామచంద్రయ్య, పేరాల పూలమ్మ, మల్లెపాక సాయిబాబా
- **హుజూర్‌నగర్:** బొబ్బా భాగ్యారెడ్డి, పోరెడ్డి కిషోర్‌రెడ్డి, గట్టు శ్రీకాంత్‌రెడ్డి, లంబల్ల నరేష్, ఇస్లావత్ బాలాజీ నాయక్
- **కోదాడ:** నూకల పద్మావతి, ఓర్సు వేలంగి రాజు, నూనె సులోచన
- **భువనగిరి:** పీవీ శ్యాంసుందర్‌రావు, గూడూరు నారాయణరెడ్డి, పాశం భాస్కర్, మాయ దశరథ
- **ఆలేరు:** పడాల శ్రీనివాస్, సూదగాని హరిశంకర్‌గౌడ్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్

**పార్టీని విస్తరించేలా..**
నల్లగొండ పార్టీ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన నియోజకవర్గాల సమావేశంలో.. దూకుడు పెంచడం, పార్టీని విస్తరించడం, అసంతృప్తులకు అడ్డుకట్ట వేయడం లక్ష్యంగానే దృష్టి సారించారు. పార్టీ బలాలు, బలహీనతలు, అభ్యర్థుల వ్యక్తిగత బలాలను తెలుసుకోవడంతోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ బలాబలాలు, వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపైనే చర్చించి దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై పోరాటాలు వంటివి ప్లాన్ చేసుకొని ముందుకు సాగాలని ఆదేశించారు. పార్టీకి బలం ఎక్కువగా ఉన్న సూర్యాపేట, నల్లగొండ, దేవరకొండ, భువనగిరి వంటి నియోజకవర్గాల్లో దూకుడు పెంచాలని స్పష్టం చేశారు.

# కష్టపడితే విజయం మనదే..




నేరేడుచర్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నేనే
- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నేరేడుచర్ల:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే విజయం మనదేనని నల్లగొండ ఎంపీ, తెలంగాణ పీసీసీ మాజీ అధ్యక్షుడు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన నేరేడుచర్లలో నిర్వహించిన నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీకి ముందస్తుగా ఎన్నికలు వస్తే కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు రైతులకు రుణ మాఫీ పథకం, ముస్లింలు, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోవడంతో పాటు గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మూడు రోజుల్లో సాగర్‌నీటిని విడుదల చేయకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆమోదంతో హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా తాను పోటీలో ఉంటానని, కోదాడలో తన భార్య ఉత్తమ్ పద్మావతి పోటీ చేస్తున్నారని, రెండుచోట్లా తాము 50వేల మెజా ర్టీతో గెలుస్తామన్నారు. సమావేశంలో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, గరిడేపల్లి కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్, పాలకవీడు ఎంపీపీ భూక్య గోపాల్, కౌన్సిలర్లు ప్రకాశ్, జితేందర్‌రెడ్డి, నాగయ్య, నాయకులు పైడిమర్రి రంగనాథ్, మోతీలాల్, రమేష్, నర్సింహారావు, కట్ట రామారావు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



నూతన కార్యాలయంలో డీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** వానాకాలం (2023–24) సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 3.46లక్షల ఎకరాల్లో వరి పంట సాగైందని, సుమారు 9.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఐకేపీ ద్వారా 183, పీఏసీఎస్‌ల ద్వారా 113 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అంచనా వేసినట్టు పేర్కొన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోలుకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలన్నారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, పౌరసరఫరాల డీఎం రాంపతి, డీఏఓ రామారావు నాయక్, సహకార శాఖ అధికారి శ్రీధర్, డీఎస్‌ఓ మోహన్ బాబు, మిల్లర్స్ ప్రతినిధి కె.చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పౌరసరఫరాల శాఖ కార్యాలయాలను ప్రారంభించిన అదనపు కలెక్టర్**
అనంతరం నూతన కలెక్టరేట్ సముదాయంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాలను అదనపు కలెక్టర్ ఏ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, శ్యామ్, డీవైఎస్‌ఓ వెంకటరెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి దయానందరాణి, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, కార్యాలయ ఏఓ సుదర్శన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు

# నిరీక్షణకు మోక్షం!

**ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్**

- రీ షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- నేటి నుంచి అక్టోబర్ 3 వరకు ప్రక్రియ
- మూడేళ్లలోపు సర్వీసుంటే బదిలీకి మినహాయింపు
- జిల్లా వ్యాప్తంగా 748 పోస్టులు ఖాళీ



చిలుకూరు మండలం రామ్‌నగర్ పాఠశాలలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

**చిలుకూరు:** ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు విద్యాశాఖ శ్రీకారం చుట్టి తీపికబురు అందించింది. హైకోర్టు తుది తీర్పునకు లోబడి విద్యాశాఖ శుక్రవారం రీ షెడ్యూల్ విడుదల చేసింది. ప్రభుత్వం జనవరిలో ఉపాధ్యాయ బదిలీలకు షెడ్యూల్ జారీ చేసి, ఫిబ్రవరి మొదటి వారంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. అయితే, స్పౌస్ పాయింట్లు, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులకు ప్రత్యేక పాయింట్లు ఇవ్వడం సరికాదని, జీఓ అసంపూర్తిగా ఉన్నదని పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల జీఓపై హైకోర్టు స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈ ఏడాది మార్చిలో నిలిచిపోయింది. దీంతో ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో పాఠశాల విద్యా వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తున్నాయి. చాలా మంది ఉపాధ్యాయులకు అర్హత ఉన్నా పదోన్నతులు పొందకుండానే ఉద్యోగ విరమణ చేశారు. చాలా పాఠశాలలో జీహెచ్‌ఎం, మండల విద్యాధికారి పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన హైకోర్టు ఎట్టకేలకు తుది తీర్పు వెలువరించడంతో విద్యా శాఖ ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లకు తిరిగి రీ షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఒకేచోట 8 ఏళ్ల సర్వీస్ పూర్తయిన ఉపాధ్యాయులు, ఐదేళ్ల పనిచేసిన హెచ్‌ఎంలు బదిలీలకు అర్హులుగా ప్రకటించింది.

**ఖాళీ పోస్టుల వివరాలు**

| | |
|---|---|
| జీహెచ్‌ఎంలు | 107 |
| స్కూల్ అసిస్టెంట్లు | 287 |
| ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు | 104 |
| ఎల్‌పీ(లాంగ్వేజ్ పండిట్లు) | 23 |
| పీఈటీలు | 04 |
| ఎస్‌జీటీలు | 223 |

(ఇవికాక జిల్లాలో 12 ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.)

**మూడేళ్లలోపు సర్వీస్ ఉంటే..**
కాగా బదిలీల ప్రక్రియలో భాగంగా రిటైర్‌మెంట్‌కు మూడేళ్లలోపు సర్వీస్ కలిగి ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బదిలీ నుంచి మినహాయింపు ఉంది. జిల్లాలో సుమారుగా ఈ అర్హత కలిగిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వెయ్యి మంది వరకు ఉంటారని తెలిసింది.

**షెడ్యూల్ ఇలా..**
ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరిస్తారు. 6, 7న ఆన్‌లైన్ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. 8, 9న దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు పేర్లను ప్రకటిస్తారు. 10, 11న తిరిగి అభ్యంతరాలు స్వీకరణ ఉంటుంది. 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితాను ప్రచురిస్తారు. 15న ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయులు బదిలీలు చేపడతారు. 17, 18, 19న స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు చేపట్టి పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. 20, 21న ఖాళీ అయిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రకటించి 21, 22న బదిలీలకు అర్హత కలిగిన వారికి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడంతోపాటు సవరణకు అవకాశం ఇస్తారు. 26, 27, 28న ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తారు. అక్టోబర్ 3న ఎస్‌జీటీలు, పీఈటీ, బాషా పండితుల బదిలీలు చేపడతారు. 5 నుంచి 19వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారు.

### ‘ప్రైవేట్’లో రిజర్వేషన్ల అంశం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

**భానుపురి (సూర్యాపేట):** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషను, జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ల హస్సేన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో చేర్చాలని 14 డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బేగరీ శివరాజ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గాలయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బొల్లు సత్యం, సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ దీక్ష భగ్నం.. తుంగతుర్తిలో ఉద్రిక్తం

- దీక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



తుంగతుర్తిలో బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

**తుంగతుర్తి:** నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాదరి కిషోర్ సాగిస్తున్న ఇసుక మాఫియా, అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా శుక్రవారం తుంగతుర్తిలో బీజేపీ నాయకులు చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఎమ్మెల్యే కిషోర్‌కు వ్యతిరేకంగా బీజేపీ నేతలు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దీక్ష చేపట్టారు. అయితే బీజేపీ దీక్ష చేపట్టాడాన్ని ఖండిస్తూ బీఆర్‌ఎస్ నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. ఒకవైపు బీజేపీ నేతలు నినాదాలు.. మరోవైపు బీఆర్‌ఎస్ చేపట్టిన ర్యాలీ చౌరస్తాకు చేరుకోవడంతో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు బీజేపీ దీక్షను భగ్నం చేసి ఆ పార్టీ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో పరిస్థితి ప్రశాంతంగా మారింది. దీక్షకు వ్యతిరేకంగా మరోపక్క అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. దీంతో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయుల నినాదాలతో తుంగతుర్తి పట్టణం మారుమోగింది. దీంతో పోలీసులు భారీ ఎత్తున మోహరించి ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

**బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం**
నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. దీక్షను భగ్నం చేసిన పోలీసులు పలువురు బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇసుక మాఫియాతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. తాము శాంతియుతంగా నిరసన దీక్ష చేపడుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అరెస్ట్ అయిన వారిలో పేరాల పూలమ్మ, గాజుల మహేందర్, భూతం సాగర్, శ్యామ్, కత్తుల నరేష్, నాగరాజు, భాష, మహేష్, సందీప్ తదితరులు ఉన్నారు.

# సాగర్ నీరు విడుదల చేయాలని రాస్తారోకో



చిలుకూరులో రాస్తారోకో చేస్తున్న అఖిల పక్ష నాయకులు

**చిలుకూరు:** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని తక్షణమే నీటిని విడుదల చేయాలని అఖిల పక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చిలు కూరు బస్టాండ్ సెంటర్‌లో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి 165పై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తక్షణమే నీళ్ల విడుదల చేసి వరి పొలాలను కాపాడాలన్నారు. వర్షాలు లేక భూగర్భ జలాలు తగ్గి బావుల్లో నీళ్ల అడుగంటడడంతో రైతులు సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# ఒక్క రోజే రూ.1.74కోట్లు

**రాఖీ రోజున ఆర్టీసీకి భారీగా సమకూరిన ఆదాయం**

- రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నల్లగొండ రీజియన్
- సంస్థకు కలిసొస్తున్న రాఖీ పౌర్ణమి



రాఖీ రోజున సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

**భానుపురి (సూర్యాపేట):** రాఖీ పౌర్ణమితో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కలిసి వస్తోంది. ఏటా రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండడంతో సంస్థకు దండిగా ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో ఈ సారి ఆగస్టు 31వ తేదీన రాఖీ పౌర్ణమి సందర్భంగా ఒక్క రోజే ఆర్టీసీ నల్లగొండ రీజియన్‌కు దాదాపు రూ.కోటి 74 లక్షల ఆదాయం వచ్చింది. దీంతో రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం పొందిన రీజియన్‌గా నల్లగొండ రీజియన్ నిలిచింది. గతేడాది రాఖీ సందర్భంగా కూడా ఇదేవిధంగా ఆదాయం రావడం విశేషం. ఇందులో నల్లగొండడ డిపోనకు అత్యధికంగా రూ.36.42 లక్షలు ఆదాయం రాగా అత్యల్పంగా నార్కట్‌పల్లి డిపోనకు రూ.3.49 లక్షలు మాత్రమే వచ్చింది. ఈ ఏడాది రాఖీ పండుగకు బస్సుల్లో ప్రయాణించే మహిళలకు బహుమతులు ఇవ్వనున్నటు ప్రకటించిన విషయం తెలిసిందే.

**104 ఆక్యుపెన్సీ రేషియోతో..!**
నల్లగొండ రీజియన్ పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, యాదగిరిగుట్ట, సూర్యాపేట, కోదాడ డిపోలు ఉన్నాయి. ఈ రాఖీ పండుగకు రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి దాదాపు 706 బస్సు సర్వీసులను 2,80,045 కిలోమీటర్ల మేర నడిపారు. ప్రధాన రద్దీ ప్రాంతాలను ఎంచుకుని సంస్థ ప్రణాళిక ప్రకారం ఈ సర్వీసులను నడపడంతో మంచి ఆదాయాన్ని గడించింది. రీజియన్‌లోని నార్కట్‌పల్లి డిపో 95 ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) మినహా అన్ని డిపోలు 100 శాతానికి పైగానే ఓఆర్‌తో నడిచాయి. దీంతో 104 ఓఆర్‌తో దేవరకొండ డిపో రూ.30.64 లక్షలు, 111 ఓఆర్‌తో నల్లగొండ డిపో రూ.36.42 లక్షలు, 104 ఓఆర్‌తో మిర్యాలగూడ రూ.29.77 లక్షలు, యాదగిరిగుట్ట రూ.21.35 లక్షలు, 103 ఓఆర్‌తో కోదాడ 23.16 లక్షలు, 101 ఓఆర్‌తో సూర్యాపేట డిపో రూ.29.67 లక్షల ఆదాయాన్ని పొందాయి.

**ఆదాయం వివరాలు..**

| డిపో | ఆదాయం (రూ.లలో..) |
|---|---|
| దేవరకొండ | 30,64,667 |
| నల్లగొండ | 36,42,898 |
| నార్కట్‌పల్లి | 3,49,013 |
| మిర్యాలగూడ | 29,77,092 |
| యాదగిరిగుట్ట | 21,35,836 |
| కోదాడ | 23,16,672 |
| సూర్యాపేట | 29,67,110 |
| మొత్తం | 1,74,53,288 |

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండల పరిధిలోని గుల్లి కాలనీలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులో కి వచ్చింది. కాలనీలో ఓ వృద్ధుడు (75) గత కొద్ది రోజులుగా యాచిస్తూ రాత్రి వేళల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లల్లోని ఓ ఇంటిలో తలదాచుకుంటున్నాడు. వృద్ధాప్యంలో న డవ లేని స్థితిలో ఉండడం, ఆహారం, నీరు లేక మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఇతని మృతిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

### లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

భువనగిరి: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన భువనగిరి మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన సుర్వి ప్రశాంత్‌గౌడ్(23) తన సొంత పనినిమిత్తం భువనగిరికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బైకుపై బయలుదేరాడు. హన్మాపురం గ్రామ పరిధిలోని బచ్‌పన్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

### బంగారం మెరుగు పేరుతో మోసం

భువనగిరి: బంగారం మెరుగు పేరుతో ఓ మహిళను మోసం చేసిన సంఘటన శుక్రవారం భువనగిరిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన చిందం రాములమ్మ వద్దకు గత నెల 24న గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బంగారం మెరుగు పెట్టేందుకు వచ్చామని ఆమెతో తెలిపారు. ఆమె మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసును తీసుకుని, వారు తన వెంట తెచుకున్న లిక్విడ్‌లో ముంచారు. అనంతరం సుమారు రెండున్నర తులాలు ఉన్న మరో గొలుసును ఆమెకు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత రాములమ్మ చూసుకునే సరికి గొలుసు రెండున్నర తులాలు మాత్రమే ఉంది. మెరుగు పేరుతో మోసం చేశారని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు చోరీ పాల్పడిన పత్తిపాటి నాగరాజు, బొబ్బ వెంకట్‌రెడ్డిలను శుక్రవారం పట్టుకుని రూ. 17వేల నగదు, బైకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

### చికిత్స పొందుతున్న మహిళ మృతి

నకిరేకల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. సూర్యాపేట జిల్లా బండమీది చందుపట్లకు చెందిన అబ్బగోని సరిత(32)కు 13 ఏళ్ల క్రితం నకిరేకల్‌లోని 8వ వార్డు పరిధిలోని వాసవీ నగర్‌లో నివాసముంటున్న చౌగోని శంకర్‌తో వివాహం జరిగింది. ఇటీవల సరిత భర్త ప్రమాదంలో గాయపడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు నెలకొనడంతో మనస్తాపంతో సరిత ఆగస్టు 30న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధీర్ తెలిపారు.

### అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: మండలంలోని హనుమాపురంలో అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఎర్ర బోయిన నరసింహ(45)కు అప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో భార్య, కూతురు నిద్రిస్తుండగా ఇంటి సమీపంలోని ఓ భవనం మెట్లకు ఉన్న ఇనుప చువ్వకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని కిందకు దించి, పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు

# ఐటీ జాబ్‌మేళాకు విశేష స్పందన

- నల్లగొండ ఐటీ హబ్‌లో ఉద్యోగాలకు టాస్క్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా
- హాజరైన 15,316 మంది అభ్యర్థులు
- ఇంటర్వ్యూలు నిర్వహించిన 14 కంపెనీలు

నల్లగొండ: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌లో ఉద్యోగాలకు శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న లక్ష్మీ గార్డెన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. గత నెల 25వ తేదీన ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరగా నల్లగొండ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి 15,316 మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. దీంతో పెద్దఎత్తున నిరుద్యోగులు జాబ్‌మేళాకు వచ్చారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా నల్లగొండ ఐటీ ఉద్యోగ అవకాశం రావడంతో జాబ్‌మేళాకు హాజరయ్యారు. వీరికి భోజనం, తదితర ఏర్పాట్లను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు.

**హాజరైన 14 కంపెనీలు..**

జాబ్‌మేళాకు మొత్తం 14 కంపెనీలు వచ్చాయి. ఇన్ఫోక్స్ డేటా సొల్యూషన్ కంపెనీ, స్మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కేటీకే బిజినెస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, టీసీడీసీ క్లౌడ్ సెంటర్ లిమిటెడ్, స్మాష్‌బీ, డిమాన్డ్ టెక్నాలజీ, డిజిక్స్‌ఫోమ్, ఇన్ఫో జంక్షన్, విన్‌ఫోటైన్‌మెంట్ మీడియా అండ్ బ్రాడ్ కాస్టింగ్, హిట్లోప్, న్యూమెరిక్ టెక్నాలజీ, జీఎస్ఆర్ మీడియా, కోనం ఫౌండేషన్ కంపెనీలు ఇందులో ఉన్నాయి.

**అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్టు..**

ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి టాస్క్ కంపెనీ మొదటగా ఆన్‌లైన్‌లో ప్రాథమిక టెస్టు నిర్వహించింది. అక్కడ స్క్రీనింగ్ చేసిన తర్వాత వారి బయోడేటా టెస్టు నిర్వహించిన ఫాం తీసుకొని ఫంక్షన్ హాల్‌లో కంపెనీ నిర్వాహకుల వద్దకు పంపించారు. అభ్యర్థులు మొదటగా ఆన్‌లైన్‌లో 14 కంపెనీలకు సంబంధించిన సమాచారం రావడంతో వారు ఏ కంపెనీ అయితే ఎంపిక చేసుకున్నారో ఆ కంపెనీ వద్దకు పంపించారు. అక్కడ కంపెనీ వారు ఆన్‌లైన్‌లో రిటెన్ టెస్ట్, అనంతరం గ్రూప్ డిస్కషన్ నిర్వహించారు. కాగా.. హాజరైన 15,316 మందిలో స్క్రూట్నీ చేసిన తరువాత 3,216 మంది మిగిలారు. వీరిని షార్ట్‌లిస్ట్ చేసి 370 మందిని ఎంపిక చేశారు. సోమవారం తర్వాత హైదరాబాద్‌లో టెక్నికల్ రౌండ్ నిర్వహించనున్నారు. వీటన్నింటిలో పాసైన వారికి ఫోన్‌ద్వారా సమాచారం అందిస్తారు. అనంతరం ప్లేస్‌మెంట్ ఇవ్వనున్నారు.



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు



జాబ్‌మేళాకు వస్తున్న యువతి





విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఐటీ కంపెనీ ప్రతినిధులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఐటీ ప్రతినిధులు

**“ మంచి అవకాశం**



స్థానికంగానే ఐటీ ఉద్యోగాలు అనేవి చాలా సంతోషాన్ని కలిగిస్తుంది. దూరప్రాంతాలకు పోలేనివారికి ఇది మంచి అవకావం. వేలాది మంది యువత జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఉద్యోగాలు కొన్నే ఉన్నాయి. కనుక ఇంకా ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు మరిన్ని కంపెనీలను పిలిచి మళ్లీ జాబ్‌మేళా నిర్వహించాలి. – మంద కావేరి

**“ ఐటీ ఉద్యోగం కావాలని వచ్చా**



నాకు పెళ్లి కాకముందు బ్యాంకులో ఉద్యోగం చేశా. ప్రస్తుతం చేయడం లేదు. నల్లగొండలో ఐటీ హబ్ ఏర్పాటు చేయడం, ఉద్యోగాలకు ఇక్కడే అవకాశాలు రావడంతో ఐటీలో ఉద్యోగాలు చేయాలని వచ్చాను. దూర ప్రాంతాలకు వెళ్లలేక నల్లగొండలోనే ఐటీ ఉద్యోగం చేసేందుకు అవకాశం వచ్చింది కాబట్టి జాబ్‌మేళాకు హాజరయ్యా. – చందన నల్లగొండ

**“ పెద్ద ఎత్తున హాజరయ్యారు**



జాబ్ మేళాకు యువత పెద్దఎత్తున హాజరయ్యారు. వారి ట్యాలెంట్‌ను బట్టి ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయి. కంపెనీలు రూ.10లక్షల ప్యాకేజీ కూడా ఇస్తున్నాయి. ఈ జాబ్‌మేళా ద్వారా ఐటీ ఉద్యోగాలకు ఎంపికైన వారికి టాస్క్ ఆధ్వర్యంలో మంచి శిక్షణ ఇస్తాం. చాలా మంది టాస్క్ ఆధ్వర్యంలో యూఎస్, హైదరాబాద్‌లో ఉద్యోగాలు పొందారు. – శ్రీకాంత్ సిన్హా, టాస్క్ సీఈఓ

**“ గ్రామీణ ప్రాంతాల వారికి ఎంతో మేలు**



నేను ఎంటెక్ పూర్తి చేశాను. హైదరాబాద్‌లో జాబ్‌మేళాకు కూడా హాజరయ్యా. నల్లగొండ ఐటీ హబ్‌లో జాబ్‌మేళాకు చాలా కంపెనీలు వస్తున్నాయని తెలుసుకుని ఇక్కడకు వచ్చా. నల్లగొండలో ఐటీ హబ్ ఏర్పాటుతో ఇక్కడ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. చాలా మంది హైదరాబాద్ వెళ్లలేని వారికి ఇది మంచి అవకాశం. – అనూష, మహబూబాబాద్

**“ నల్లగొండ అభివృద్ధి చెందుతుంది**



నల్లగొండ పట్టణం అభివృద్ధి చెందుతుంది. ఐటీ హబ్ ఏర్పాటు కావడంతో ఇక్కడి ప్రాంత యువతకు దూరప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగానే ఉద్యోగాలు సంపాదించుకోవచ్చు. చిన్న ఉద్యోగం అయినా చేరి అందులో ట్రైన్ అయిన తర్వాత మంచి కంపెనీలో అవకాశం వస్తే వెళ్లొచ్చు. నల్లగొండలో ఐటీ హబ్ ఇక్కడి యువతకు ఎంతో మేలు. – సంతోష్, చర్లపల్లి

**“ యువతకు మంచి అవకాశం**



అమెరికాలో కోనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో కూడా నిర్వహించాం. మంత్రి కేటీఆర్ నల్లగొండ ఐటీ హబ్‌లో కూడా జాబ్ మేళా నిర్వహించాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చాం. నాది నల్ల గొండ జిల్లానే. సొంత గడ్డపై యువతకు నా కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగాలు కల్పించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఐటీహబ్‌తో ఇక్కడి ప్రాంత యువతకు ఇక్కడే ఉద్యోగాలు చేసుకునే అవకాశం దొరికింది. – సందీప్, కోనం ఫౌండేషన్ చైర్మన్

# రైతు రుణాలు వడ్డీతో సహా మాఫీ చేయాలి

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం రైతుల రుణాలను వడ్డీతో సహా మాఫీ చేయాలని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ హుజూర్ నగర్, మఠంపల్లి మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులు తీసుకున్న రుణం మాత్రమే మాఫీ చేయడంతో.. దానికి వడ్డీ కూడా అసలంత అయిందని అన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు 90 పథకాలు ప్రకటించి 9 మాత్రమే పూర్తి చేయడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తోందని, తెలంగాణలో కూడా 70 సీట్లు గెలవబోతున్నామని చెప్పారు. కర్నాటకలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఓపీఎస్ అమలు చేస్తోందని గుర్తుచేశారు. నాగార్జున సాగర్ డ్యాంలో నీటిమట్టం 510 అడుగులు ఉన్ననాడే కాంగ్రెస్ ప్రభుత్వం తాగునీరు అందించిందన్నారు. ప్రస్తుతం 523 అడుగుల నీరున్నా కనీసం చెరువులు నింపేందుకు, తాగటానికి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నీటిని విడుదలచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ తమ మండలాల్లో, గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతి బూత్‌లో 100 మంది ఓటర్లకు ఒక సమన్వయకర్తను నియమించాలని ఆయన కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు దొంగరి వెంకటేశ్వర్లు నిజాముద్దీన్, మంజూనాయక్, గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కస్తాల శ్రవణ్, రాజా నాయక్, మాజీ ఎంపీపీ నిర్మల, సర్పంచ్ నాగసైదులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

# వన భోజనాల రోజే కుటుంబంలో విషాదం

- నీటి సంపులో పడి చిన్నారి మృతి

మాడుగులపల్లి: గ్రామ దేవతలకు బోనం పెట్టిన మరుసటి రోజు వన భోజనాలకు వెళ్లి ఇంటికి చేరిన గంటలోనే నీటి సంపులో పడి ఓ చిన్నారి మృతిచెందింది. ఈ హృదయ విదారక ఘటన మాడుగలపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మండల కృష్ణ, నాగలక్ష్మి దంపతులకు మూడేళ్ల బాబు, ఏడాదిన్నర కుమార్తె (అమ్ములు) ఉన్నారు. గురువారం బోనాల పండుగ కావడంతో గ్రామ దేవతలకు బోనం సమర్పించారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులంతా వన భోజనాలకు వెళ్లారు. సాయంత్రం భార్యతోపాటు ఇద్దరు పిల్లలను కృష్ణ బైక్‌పై తీసుకువచ్చి ఇంటి వద్ద దించాడు. పొలం వద్ద ఉన్న తల్లిని తీసుకువచ్చేందుకు తిరిగి వెళ్లగా.. భార్య నాగలక్ష్మి ఇంటి పనిలో నిమగ్నమైంది. పిల్లలిద్దరూ ఆడుకుంటుండగా ఇంటి ఆవరణలో నీటి సంపు మూత తెరిచి ఉండడంతో కుమార్తె అందులో పడిపోయింది. ఇంటికి వచ్చిన కృష్ణ పాప కోసం వెతకగా కనిపించలేదు. అనుమానం వచ్చి సంపులో చూడగా అందులో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే బయటకు తీసి 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకొని సీఆర్పీ నిర్వహించినా చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



అమ్ములు (ఫైల్)

# పెసళ్లకు మద్దతుకు మించి ధర

తిరుమలగిరి (తుంగతుర్తి): పెసర పంట దిగుబడి ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. రైతులు పెసళ్లు అమ్మేందుకు మార్కెట్లకు వస్తున్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో శుక్రవారం తొలిసారి తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు 153 బస్తాల పెసళ్లు వచ్చాయి. పెసళ్లకు ప్రభుత్వ మద్దతు ధరకు మించి ధర పలికింది. మద్దతు ధర క్వింటాకు రూ.7,755 ఉండగా.. గరిష్ఠంగా క్వింటాకు రూ.8,189, కనిష్టగా రూ.7,563 ధర పలికింది. అలాగే సీజన్ కాకున్నా కందులు కూడా భారీ ధర పలికాయి. కందులు క్వింటాకు మద్దతు ధర రూ.6,600 ఉండగా.. గరిష్ఠంగా క్వింటాకు రూ.10,363, కనిష్టంగా రూ.9,999 ధర పలికింది.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో పెసళ్ల రాశులు

# పులీందర్‌రెడ్డి హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు

- తీర్పు వెల్లడించిన సూర్యాపేట జిల్లా కోర్టు
- వివరాలు వెల్లడించిన స్పెషల్ పీపీ శ్రీవాణి

చివ్వెంల (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ కేంద్రంలో 2014లో జరిగిన జూలకంటి పులీందర్‌రెడ్డి హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మునగాల మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ పులీందర్‌రెడ్డి గ్రామానికి చెందిన పిడమర్తి అబ్రహం, మరొక బైక్‌పై పెద్ది ఉపేంద్రచారిలతో కలిసి 2014 జనవరి 30న కోదాడకు వెళ్లారు. కోదాడ పట్టణ సమీపంలోని విజయవాడ– హైదరాబాద్ రహదారి నుంచి సర్వీసు రోడ్డు మీదుగా వెళ్తుండగా, వెనుక నుంచి కారులో వచ్చిన నర్సింహులగూడేనికి చెందిన ఏ1 షేక్ షబ్బీర్, ఏ2 కొప్పుల లక్ష్మీనారాయణ, ఏ3 షేక్ జలీల్, మిర్యాలగూడేనికి చెందిన ఏ4 మాతంగి శ్రీనివాస్, సూర్యాపేటకు చెందిన ఏ5 షేక్ ఇబ్రహీం, కోదాడ పట్టణానికి చెందిన ఏ6 దూళిపాళ్ల నరేంద్రతో పాటు నర్సింహులగూడేనికి చెందిన షేక్ రంజాన్, షేక్ సైదా, ముస్కు ఆంజనేయులు.. వీరి బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై వెళ్తున్న పులీందర్ రెడ్డి, అబ్రహం కిందపడిపోయారు. దుండగులు తమతో తెచ్చుకున్న వేట కొడవళ్లు, గొడ్డళ్లతో పులీందర్‌రెడ్డిని విచక్షణారహితంగా నరకడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు అతడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు వినియోగించిన కారును దగ్గరలో ఉన్న చింత్రియాల గ్రామంలోని ఓ హోటల్ వద్ద వదలి, అక్కడ నుంచి విజయవాడకు వెళ్లారు. అక్కడే సంధ్య లాడ్జిలో బస చేశారు. నిందితుల్లో ఏ2 రక్తం కారులో స్టీరింగ్‌పై పడటంతో, దాని నమూనాలతో పాటు, అతని చేతి వేలికి గాయం కావడంతో ఆ రక్త నమూనాలు సేకరించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. దీంతో పాటు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న అబ్రహం, మరో 31 మంది సాక్ష్యాలను న్యాయమూర్తి, పరిగణలోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించి ప్రత్యేకంగా నియమించిన స్పెషల్ పీపీ కందుగుల శ్రీవాణి వాదనలతో పాటు మరో ఇద్దరు పీపీలు వెంకటేశ్వర్లు, కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి ఈ ఆరుగురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. కాగా.. ఇందులో ఏ3 గా ఉన్న షేక్ జలీల్‌పై రెండు నెలల క్రితం మరొక కేసు కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మిగతా ఐదుగురు నిందితులను జైలుకు తరలించారు. పీపీలకు లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ సహకరించారు.



వివరాలు వెల్లడిస్తున్న స్పెషల్ పీపీ శ్రీవాణి

**నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్ష తప్పదు**

నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్ష తప్పదు. శుక్రవారం పులిందర్ రెడ్డి హత్య కేసు నిందితులకు జీవితఖైదు పడడానికి కృషి చేసిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో పాటు, లైజన్ ఆఫీసర్, కోర్టు కానిస్టేబుల్‌కు ప్రత్యేక అభినందనలు. రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో కోర్టు విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. – ఎస్పీ రాజేంద్రప్రసాద్

# నర్సింహులగూడెంలో హత్యల పరంపర

- గత 30 ఏళ్లలో హత్యకు గురైన 9మంది సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు
- గ్రామాన్ని వదలివెళ్లిన 50కుటుంబాలు

మునగాల(కోదాడ): మునగాల మండలంలో సమస్యాత్మక గ్రామంగా పేరొందిన నర్సింహులగూడెంలో సీపీఎం, కాంగ్రెస్ పార్టీల మధ్య నెలకొన్న ఘర్షణల్లో 1995నుంచి 2014వరకు దాదాపు 20 ఏళ్లలో ఇరుపార్టీలకు చెందిన 9మంది హత్యకు గురయ్యారు. గ్రామంలో రెండు వర్గాలు తమ ఆధిపత్యం కోసం ఘర్షణలు, హత్యలకు పాల్పడుతుండడంతో పదుల సంఖ్యలో కుటుంబాలు గ్రామాన్ని వదిలివెళ్లాయి.

**తిరిగి ఏడేళ్ల తర్వాత..**

గ్రామంలో సీపీఎంకు చెందిన షేక్ అమీర్ 1995లో ప్రత్యర్థులు చేసిన తుపాకీ కాల్పుల్లో మృతి చెందాడు. 1996లో అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నరంశెట్టి వెంకటనారాయణను తన ప్రత్యర్థి వర్గాలు హత్యచేశాయి. దీనికి ప్రతీకారంగా సీపీఎం డివిజన్ నాయకుడు ముదిరెడ్డి ఆదిరెడ్డిని 1997లో ఎదుటి వర్గం వారు మొద్దుల చెర్వు స్టేజీ వద్ద దారికాచి దారుణంగా హత్య చేశారు. దీనికి ప్రతికారంగా అదే సంవత్సరం ప్రత్యర్థి వర్గాలు పెరుమాళ్లపల్లి రాంచంద్రయ్యను హత్య చేశాయి. ఇదే సంవత్సరంలో ఆదిరెడ్డి హత్యను జీర్ణించుకోలేని సీపీఎం వర్గాలు గ్రామంలో విధ్వంసానికి పాల్పడ్డాయి. దీనికి ప్రతీకారంగా 1999లో కోర్టుకు హాజరై తిరిగి వస్తున్న ఆదిరెడ్డి సోదరుడు ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మార్గమధ్యలో కేతేపల్లి వద్ద అడ్డగించిన ప్రత్యర్థి పార్టీ వర్గాలు దారుణంగా హత్య చేశాయి. శ్రీనివాసరెడ్డి హత్యను జీర్ణించుకోలేని ఆయన వర్గానికి చెందిన కొందరు.. యూత్ కాంగ్రెస్ నాయకుడు ఖాసీంఖాన్‌ను 2002లో సూర్యాపేటలో హత్య చేశారు. ఖాసీంఖాన్ హత్య తరువాత దాదాపు ఐదేళ్ల పాటు గ్రామం ప్రశాంతంగా ఉంది. అనంతరం పీఏసీఎస్ చైర్మన్, డీవైఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న బొంత శ్రీనివాసరెడ్డి కోదాడ నుంచి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలోని ఆకుపాముల వద్ద దారికాచి 2007లో ప్రత్యర్థి వర్గాలు హత్య చేశాయి. తిరిగి ఏడేళ్ల తర్వాత 2014లో నాటి సీపీఎం నుంచి నర్సింహులగూడెం సర్పంచ్‌గా ఎన్నికైన జూలకంటి పులీందర్‌రెడ్డిని ప్రత్యర్థి వర్గీయులు కోదాడ పట్టణ శివారులో వెంబడించి వేటకొడవళ్లతో నరికి చంపారు.

**ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో రాజీ..**

గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బొంత శ్రీనివాసరెడ్డి హత్య అనంతరం 2010లో ఆనాడు మంత్రిగా కొనసాగుతున్న ప్రస్తుత నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో ఇరు వర్గాలు రాజీ కుదుర్చుకున్నాయి. ఇకపై ఘర్షణలకు, హత్యలకు తావివ్వకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ఇరు వర్గాలు ఒప్పందం చేసుకున్నాయి. కానీ, కాంగ్రెస్ వర్గాలు ఒప్పందాన్ని ఉల్లఘించి 2014లో సీపీఎంకు చెందిన ఆనాటి నర్సింహులగూడెం సర్పంచ్ పులీందర్‌రెడ్డిని దారుణంగా హత్య చేశాయి. ఈ హత్యల పరంపర కొనసాగుతుండడంతో గ్రామంలో సుమారు 50కుటుంబాలు గ్రామాన్ని వదలివెళ్లాయి.





నర్సింహులగూడెంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ లోకేష్

**పదేళ్ల పాటు కొనసాగిన విచారణ**

జూలకంటి పులీందర్‌రెడ్డి హత్యకు గురికావడంతో ఆయన భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ పార్టీ వర్గాల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో న్యాయస్థానం పదేళ్ల పాటు 62మంది సాక్షులతో పాటు ప్రత్యక్ష సాక్షి పిడమర్తి అబ్రహంను న్యాయమూర్తి విచారించి హత్య కేసులో ఆరుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. కాగా.. ఆరుగురి నిందితులకు జీవితఖైదు విధించడంతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా మునగాల సీఐ రాఘవులు, ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కోర్టు తీర్పు హర్షణీయం**



నా భర్త పులీందర్‌రెడ్డి హత్య కేసులో న్యాయస్థానం నాకు న్యాయం చేసింది. దాదాపు పదేళ్ల పాటు చేసిన నా పోరాటం ఫలితంగా కోర్టు తీర్పుతో నిందితులకు శిక్ష పడడం హర్షణీయం. గ్రామంలో ఘర్షణల ఫలితంగా ఎన్నో కుటుంబాలు గ్రామాన్ని వదలివెళ్లాయి. ఇకనుంచైనా హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలి. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలి. – జూలకంటి విజయలక్ష్మి, పులీందర్‌రెడ్డి భార్య

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌పై దాడి

- అడవి నుంచి మట్టి తరలింపు నేరమని చెప్పినందుకు దాడికి పాల్పడిన ట్రాక్టర్ యజమాని

మిర్యాలగూడ టౌన్: అడవి నుంచి అక్రమంగా మట్టి తరలించడం నేరమని చెప్పడంతోపాటు, ట్రాక్టర్ తగిలి తెగిన విద్యుత్ తీగను సరిచేసి వెళ్లాలన్నందుకు బీట్ ఆఫీసర్‌పై ట్రాక్టర్ యజమాని దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం మిర్యాలగూడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కాలువపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మట్టిని తోలుకెళ్లేందుకు రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ఓ డ్రైవర్ ట్రాక్టర్‌తో వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ తగిలి నర్సరీలోని విద్యుత్ మోటారుకు ఉన్న తీగ తెగింది. ఫారెస్ట్‌లోకి వచ్చి అక్రమంగా మట్టిని తీసుకెళ్లడం నేరమని, తెగిన విద్యుత్ వైరు సరిచేసి వెళ్లాలని విధి నిర్వహణలో ఉన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌కు సూచించాడు. ఈక్రమంలో ట్రాక్టర్ యాజమాని అయిన కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇటుక బట్టీ వ్యాపారి సుబ్బారావుతో పాటు ఆయన అనుచరులు కొంతమంది అక్కడికి చేరుకున్నారు. ట్రాక్టర్ ఎందుకు నిలిపావంటూ బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌ను అసభ్యపద జాలంతో దూషించి, కర్రలతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న దామరచర్ల సెక్షన్ ఆఫీసర్ సీహెచ్ రాములుతోపాటు ఫారెస్ట్ సిబ్బంది నర్సరీ వద్దకు చేరుకున్నారు. గాయపడిన అధికారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై బీట్ ఆఫీసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.



గాయపడిన బీట్ ఆఫీసర్ ప్రవీణ్‌రెడ్డి



దాడికి పాల్పడిన ట్రాక్టర్ యజమాని